ఆక్రమణలు తొలగించాలని అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - తగరపువలస: పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా జీవీఎంసీ ఆదేశముల మేరకు శుక్రవారం తగరపువలస ఏరియాలో గల రోడ్డుకి ఇరువక్కల ఆక్రమణలు తొలగించాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ జోనల్ కమీషనరు, స్టేషన్ హౌస్ ఆఫీసరు, భీమిలి పోలీస్ స్టేషన్ వారి సౌజన్యంతో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ సిబ్బందితో నగర ప్రజలకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించేందుకు గాను ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రజలు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రూ.63,266.10 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక

వ్యవసాయ రంగానికి రూ.7,108 కోట్ల కేటాయింపు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పారిశ్రామిక రంగ ఔత్సాహికులు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూ.63,266.10 కోట్లతో రూపొందించిన జిల్లా వార్షిక రుణ ప్రణాళికను శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో వివిధ రంగాల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ విడుదల చేశారు. అందులో ప్రాధాన్యత రంగాలకు రూ.23,090 కోట్లు కేటాయించగా, ఇతర రంగాలకు రూ.40,176.59 కోట్లు కేటాయించారు. వ్యవసాయ రంగానికి రూ.రూ.7,108 కోట్లతో పెద్దపీట వేశారు. విద్యాపరమైన అవసరాలకు రూ.294 కోట్లు, గృహ నిర్మాణ అవసరాలకు రూ.1,355 కోట్లు కేటాయించారు. జిల్లాలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాలు, ఎం.ఎస్.ఎం.ఈ., విద్యా రుణాలు, గృహ రుణాలు, స్వయం

సహాయ సంఘాలు మొదలైన వాటికి అధిక ప్రాధాన్యత కల్పించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో బ్యాంకుల ప్రతినిధులు, అధికారులతో కలిసి రుణ ప్రణాళికను విడుదల చేసిన కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రంగాలకు ఫైనాన్సింగ్‌తో పాటు, జిల్లా స్థూల విలువ జోడింపులో రెండంకెల వృద్ధిని సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఈ ప్రణాళిక దోహదపడుతుందని పేర్కొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా అందరూ పని చేయాలి

నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో భాగంగా వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రోత్సహించేలా, రైతులకు అండగా నిలిచేలా రుణ మంజూరు ప్రక్రియ ఉండాలని సూచించారు.

ప్రభుత్వ సంస్థల నుంచి సాధారణ పౌరుల నుంచి రుణాల నిమిత్తం వచ్చే దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత కాలంలో సాయం అందించాలని చెప్పారు. ఎం.ఎస్.ఎం.ఈ., విద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ రుణాలు విడుదల చేయాలని సూచించారు.

సమావేశంలో ఎల్.డి.ఎం. ఎం.శ్రీనివాసు, రిజర్వ్ బ్యాంకు ప్రతినిధి పి. పూర్ణిమ, నాబార్డు డీడీఎం జి.ఆర్. సమంత్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, డీఆర్డీఏ పీడీ లక్ష్మీకాంత్ ఇతర జిల్లా స్థాయి అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు అయినాడ సూరి మృతి

విశాలాంధ్ర - విశాఖ: సీపీఐ అల్లిపురం శాఖ సీనియర్ సభ్యుడు, జీవీఎంసీ ఏఐటీయూసీ నాయకుడు కామ్రేడ్ అయినాడ సూరి (85) గురువారం రాత్రి మరణించారు. ఆయనకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య ఇది వరకే మరణించారు. సిపిఐ పార్టీ సభ్యుడిగా, యూనియన్ నాయకుడిగా నిబద్ధత కలిగిన కామ్రేడ్ సూరి మరణం పార్టీకి, యూనియన్ కి నష్టమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. కామ్రేడ్ సూరి భౌతికకాయం పై పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ రెహమాన్, ఎం మన్మధరావు, పి.చంద్రశేఖర్, సిఎస్ క్షేత్రపాల్, సీనియర్ పార్టీ నాయకుడు జి.కాసులరెడ్డి తదితరులు సంతాపం ప్రకటించి, వారి కుటుంబం సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ పట్ల, యూనియన్ పట్ల అంకితభావంతో ఉన్న కామ్రేడ్ అయినాడ సూరి మృతికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

విజయవాడలో పార్టీ సమావేశానికి హాజరైన వారిరువురు సూరి కుటుంబం సభ్యులకు సానుభూతిని తెలిపారు.

జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా శివప్రసాద్ రాజు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా పి.శివ ప్రసాద్ రాజు శుక్రవారం ఉదయం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ హరి వెంకట కుమారిని, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో ఇటీవల ఆరుగురికి సీఈలుగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం వివిధ చోట్ల పోస్టింగులు ఇచ్చారు. జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా పి.శివ ప్రసాద్ రాజును నియమించారు. ఏపీ సిఆర్‌డిఏలో ఎస్ఈగా పనిచేసిన శివప్రసాద్ రాజుకు పదోన్నతి కల్పించి జీవీఎంసీలో సీఈగా పోస్టింగ్ ఇచ్చారు. జీవీఎంసీకి ఇన్చార్జ్ సీఈగా పనిచేసిన ఎం.వినయ్ కుమార్‌కు రెగ్యులర్ సీఈగా పదోన్నతి కల్పించి ఏపీ యూఎఫ్ఐడీసీలో పోస్టింగ్ ఇచ్చారు. ఆయన గురువారం సీఈగా రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ రాజుకు జీవీఎంసీ ఇంజనీర్లు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ నగర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, విశాఖ నగర అభివృద్ధిలో ఇంజనీర్లు కీలక పాత్ర పోషిస్తారన్నారు.

6వ తేదీన మానవహారం జయప్రదం చేయండి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగాలని చేస్తున్న ఉద్యమ కార్యాచరణలో భాగంగా 6వ తేదీ ఆదివారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరగబోవు మానవహారంలో పెద్ద ఎత్తున కార్మిక కుటుంబలతో సహా పాల్గొనాలని నిర్వాసిత సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 32 మంది ఆంధ్రుల ప్రాణ త్యాగాలతో నిర్మించుకున్న స్టీలు ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. సుమారు 1330 రోజులగా నిరాహార దీక్షలు, ఉద్యమాలు చేస్తున్నారని, సుమారు ఎనిమిది వేల మంది ఆర్ కార్డుదారులు ఉద్యోగాలకై ఎదురు చూస్తున్నారని, ఒప్పంద కార్మికుల తొలగింపు, హెచ్ఆర్ఏ రద్దు వంటి కార్యక్రమలు నిలుపుదల చేయాలన్నారు. ఆదివారం అగనంపుడి నుండి గాజువాక వరకు జరగబోవు మహా మానవహారంలో నిర్వాసితులు, ఉక్కు కార్మికులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొవాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్లు, ప్రజ ప్రతినిధులకు, నాయకులకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసిత సంఘం నాయకులు పులి రమణ రెడ్డి, గోందేశీ సత్యరావు, అనిపిద్ది మసెను రావు, యేల్లేటి శ్రీనివాసరావు, దొమ్మటి అప్పారావు, మార్టుపూడి పరదేశీ, పిట్ట రెడ్డి , నందికి తాతరావు, ములకలపల్లి పెంటయ్య, నీలావు సోమరెడ్డి, మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని పలు కార్యక్రమాల్లో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. పద్మనాభంలోని డిసిసిబి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ రైతులందరూ సహకార వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండలంలో అన్‌సెటిల్డ్ పంచాయతీలైన కృష్ణాపురం, పద్మనాభం, బిఆర్ తాళ్లవలస రైతులకు కూడా సకాలంలో సబ్సిడీ మీద రుణాలు అందించాలని బ్యాంకు మేనేజర్‌కి ఆదేశించారు. అనంతరం పద్మనాభం కొండపై నూతనంగా నిర్మిస్తున్న ఘాట్ రోడ్డుని పరిశీలించి పనులు త్వరగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు కనిరెడ్డి పాపయ్య విగ్రహాన్ని, రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన నూతన విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ కంటుబోతు రాంబాబు, టిడిపి మండల అధ్యక్షులు కోరాడ రమణ, మాజీ మండల అధ్యక్షులు కాళ్ల నగేష్ కుమార్, మాజీ జెడ్పిటిసి దామోదర్ రావు, మండల తెలుగు యువత అధ్యక్షులు కెవి సత్యనారాయణ, కృష్ణాపురం ఎంపీటీసీ కంటుబోతు లక్ష్మి నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ కురుమిన లీలావతి, మొకర అన్నమయ్య, సుంకర పైడినాయుడు, బొడ్డు శ్రీను మరియు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగునికి ట్రై సైకిల్ పంపిణీ

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి జోన్ 3వ డివిజన్ బోయవీధిలో నివాసం ఉంటున్న బెల్లాన ఆనంద్ అనే దివ్యాంగునికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు చేతులమీదుగా ట్రై సైకిల్ పంపిణీ చేశారు. కనికల లక్ష్మి ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన ట్రై సైకిల్‌ను భీమిలి టీడీపీ కార్యాలయంలో గంటా నూకరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల వలన కుడికాలు పూర్తిగా తొలగించబడి పూర్తిగా మంచానికే పరిమితమైన నిరుపేద బెల్లాన ఆనంద్‌కి ట్రై సైకిల్ ఇవ్వాలన్న ఆలోచనకు ముందుగా దాత కనికల లక్ష్మికి హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చురకల రమణ, కాసరపు నాగరాజు, కొక్కిరి అప్పన్న, సంకురుభుక్త జోగారావు, గండిబోయిన పోలిరాజు, వియ్యపు పోతురాజు, నెక్కెళ్ళ వెంకటరావు, రాజగిరి రమణ, పైడిపల్లి నర్సింగరావు, శంకర్, యానాపు శ్రీను, మద్దిల శ్రీను, కందుల సుందర్ రావు, చింతకాయల అశోక్, బెల్లాన ఆనంద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

వన్ స్టాప్ సెంటర్, చిన్నపిల్లల వార్డు సందర్శన

ఖైదీల చికిత్స కోసం కేటాయించిన బెడ్ల వివరాలపై ఆరా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: స్థానిక కేజీహెచ్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆకస్మిక తనిఖీలు చేశారు. శుక్రవారం సాయంత్రం కేజీహెచ్‌కు వెళ్లిన ఆయన ముందుగా వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఉద్యోగుల విధి నిర్వహణ, సిబ్బంది జీతభత్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నపిల్లల వార్డును సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించారు. ఆధుని కీకరణ, ఇతర పనుల గురించి కేజీహెచ్ సూపరింటెండెంట్, ఇతర వైద్యాధికారులతో మాట్లాడారు. ఇటీవల కేంద్ర కారాగారం సందర్శనలో ఖైదీలకు కేటాయించిన బెడ్లు సరిపోవటం లేదని అక్కడి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో ఆ విషయమై కేజీహెచ్ అధికారులను ఆరా తీశారు. రాజేంద్రప్రసాద్ వార్డులో ఇప్పుడున్న బెడ్ల సంఖ్యను పెంచాలని, ఖైదీలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ వార్డుల్లో తిరిగిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. వైద్య సేవల విస్తరణ, వసతుల కల్పన, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై కేజీహెచ్ వైద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో ఆయన వెంట కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. కె.శివానంద, ఐసీడీఎస్ పీడీ జయదేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నాయుడు, ఇతర అధికారులు, కేజీహెచ్ వైద్యాధికారులు తదితరులు ఉన్నారు.

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ చంద్రబాబే ఆపగలరు

- తిరుపతి లడ్డు కల్తీ నిజం.. జంతు కొవ్వు అబద్ధం

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఒక్క చంద్రబాబు మాత్రమే ఆపగలరని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి ఆ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోవడానికి బీజేపీ యోచిస్తుందని, అయితే దేశ రాజకీయం నేడు చంద్రబాబు నాయుడు చేతిలో ఉందని, చంద్రబాబు తలుచుకుంటే విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ జరగదన్నారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం చేస్తున్న ఉద్యమాలు ఇక్కడ కాదని, చంద్రబాబు నాయుడు ఇంటి ముందు చేస్తే ఫలితం ఉంటుందని ఆయన చెప్పారు. మోడీ పాలనలో దేశం అధోగతి పాలు అయిందని, ఒకపక్క నిరుద్యోగం మరోపక్క అధిక ధరలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న హర్యానా, జమ్మూ కాశ్మీర్ ఎన్నికల్లో బిజెపి ఓటమి ఖాయమని, ఎన్నికల అనంతరం మోడీ ప్రభుత్వం కూలిపోతుందని జోస్యం చెప్పారు. పోలవరం ప్రాజెక్టు అంతర్జాతీయ ప్రాజెక్ట్ అని, ఇప్పుడు అది ప్రజలకు వరం కాదని, నాయకులకు వరంగా మారిందని ఎద్దేవా చేశారు. కోట్లాదిమంది ప్రజలు విశ్వసించే తిరుపతి ప్రతిష్టను దెబ్బతీయ రాదన్నారు. కల్తీ నిజం, జంతు కొవ్వు అబద్ధం అన్నారు. తిరుపతి పవిత్రతను కోర్టుల దృష్టికి తీసుకెళ్లడం సరికాదన్నారు. పవన్ కళ్యాణ్ ఈ విషయంలో అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. వారాహి డిక్లరేషన్ సభలో పవన్ కళ్యాణ్ చేసిన ప్రసంగం బాధను కలిగించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం నెయ్యి కొనుగోలులోనే తప్పు చేసిందని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గార సూర్యారావు పాల్గొన్నారు.

గ్రీన్ బెల్ట్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దండి

జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నేషనల్ హైవేపై ఉన్న గ్రీన్ బెల్ట్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన 52 వార్డు పరిధిలోని మర్రిపాలెం గ్రీన్ బెల్ట్, ఆర్ అండ్ బి శివ శివాని స్కూల్ ఏరియా, కరాస, ఎన్.ఎ.డి జంక్షన్ తదితర ప్రాంతాలలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఇతర అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ స్థానిక సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకు రాగా, జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ సభ్యులు తెలిపిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, నేషనల్ హైవే లో గల మర్రిపాలెం గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, నివాసితులు విన్నపం మేరకు ప్రజల ఆరోగ్య పరిరక్షణ దిశగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు వాకింగ్ ట్రాక్, బుద్ధ విగ్రహం ఏర్పాటు, ఆకర్షణీయమైన విద్యుత్తు వెలుగులు, పచ్చదనం మొదలైనవి ఏర్పాటుకు అంచనాల తయారు చేయాలని ఇంజనీర్ అధికారులను ఆదేశించామన్నారు. హైవేలో కాలువలు చాలావరకు వ్యర్థాలతో నిండి ఉన్నాయని, కాలువలు పై ఉన్న మూతలను తొలగించి కాలువలు లోని మురుగు సాఫీగా పోయే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు సంభవించినప్పుడు వర్షపు నీరు పలు ప్రాంతాల్లో రోడ్లపై నిలిచి ఉంటుందని స్థానికులు తెలపగా వర్షపు నీరు నిలువలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి, శివ శివాని స్కూల్ ప్రాంతం కొండవాలుకు సమీపం లో వున్నందున ఆ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని, కరాస ప్రాంతంలో ఉన్న హిందూ, ముస్లిం క్రిస్టియన్ ల శ్మశాన వాటికలను అభివృద్ధి పరిచేందుకు అంచనాల తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గ్రీన్ బెల్ట్ లలో, రోడ్ల సెంటర్ మీడియన్లలో మొక్కలను ఆకర్షణీయంగా, నిత్యం పచ్చదనంతో నిండి ఉండేలా తీర్చిదిద్దాలని డిడిహెచ్ ఎం.దామోదరరావు ను కమీషనరు ఆదేశించారు. ఎన్.ఎ.డి జంక్షన్ సమీపంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, అన్నీ ప్రాంతాలలో నిత్యం పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారిని డాక్టర్ నరేష్ కుమార్ కు కమీషనరు ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ సంపత్ కుమార్, కార్యనిర్వహక ఇంజనీర్లు మత్స్య రాజు, తారా ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జిమ్సర్‌లో ఫార్మకాలజిస్ట్‌ల జాతీయ సమావేశాలు

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంకు అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీజెర్చి (జిమ్సర్) వేధికగా ఆంధ్రప్రదేశ్ ఫార్మకాలజిస్ట్స్ సొసైటీ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫార్మకాలజిస్ట్‌ల జాతీయ సమావేశాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 400 వందలకు పైగా ప్రతినిధులు హజరయ్యారు. జిమ్సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ ఫార్మకాలజీ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు తగిన విధంగా సిద్ధం అవ్వాలని సూచించారు. జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.శంకర్, జిమ్సర్ ఫార్మకాలజీ విభాగం అధిపతి డాక్టర్ మాదవులు, ఆంధ్రప్రదేశ్ ఫార్మకాలజిస్ట్స్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ మీణాకుమారి జిమ్సర్ మెడికల్ సూపరెంటెండెట్ డాక్టర్ వసంత కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఔషధ రంగంలో కృత్రిమ మేధ ప్రయోజనాలు, మెడికల్ ఫార్మకాలజి, ఒకే ఔషధాన్ని వివిధ రుగ్మతలకు వినియోగించడంలో లాభ నష్టాలు, దేశ వైద్య విద్యారంగంలో కృత్రిమ మేధను ఉపయోగించుకునే అవసరాన్ని ఈ సమావేశాలలో నిపుణులు చర్చించారు. దాదాపు 100కు పైగా పరిశోధన పత్రాలను సమావేశంలో నిపుణులు సమర్పించారు. కార్యక్రమంలో జిమ్సర్ ఫార్మకాలజి డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ సభ్యులు, వివిధ కళాశాలలకు చెందిన డాక్టర్‌లు, పరిశోధకలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ సీఈకి కాంట్రాక్టర్లు అభినందన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన శివప్రసాద రాజుని జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గొంప చంద్రమౌళి ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ సభ్యులతో మాట్లాడుతూ అందరూ కలసి నగరాన్ని అభివృద్ధి చేయాలని సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గొంప చంద్రమౌళి, కన్వీనర్ రాజన వెంకటరావు, కార్యదర్శి రంది సాధురావు,

ఉపాధ్యక్షులు పియస్ ప్రసాద్, పిఎ రాజు, సలహాదారులు పైలా కృష్ణారావు, ప్రసాద్, ఆర్‌పి నాయుడు, అల్లు గోవిందరావు సత్యనారాయణ, గణేష్, పెద్దఎత్తున కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన కోరాడ

విశాలాంధ్ర - ఆనందపురం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను భీమిలి టీడీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు శుక్రవారం లోకేష్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలో పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.

అప్పన్న ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం సింహవల్లి తాయర్ సన్నిధిలో దసరా ఉత్సవాలు ప్రారంభమైనట్లు వైదిక పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి వారి దేవాలయంలో శుక్రవారం ఆలయ కార్య నిర్వహణాధికారి వేంద్రం త్రినాధరావు ఆధ్వర్యంలో అర్చక స్వాములు, వేద పండితులు శ్రీ స్వామి వారి సన్నిధిలో హంస మూలన శ్రీ రామాయణ నవరాత్రి పారాయణం అత్యంత వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా గాలిగోపురం పక్కన శ్రీ స్వామి వారి కళామందిర్ నందు దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థులచే నృత్య ప్రదర్శనలు చేశారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి జ్ఞాపికలను అందజేశారు. వీరితో సహాయ కార్య నిర్వహణ అధికారి ఆనంద్ కుమార్, రమణమూర్తి తదితరులు ఉన్నారు.

లడ్డు విక్రయాల నిలిపివేత

విశాలాంధ్ర - సాగర్ నగర్: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో బీచ్ రోడ్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో లడ్డూ విక్రయాలు నిలిపివేస్తున్నట్టు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం (టిటిడి)లో ఈ శనివారం నుండి వచ్చే శనివారం వరకు శ్రీ వారి లడ్డు విక్రయాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఇక్కడ లడ్డు విక్రయాలు వారం రోజులు పాటు నిలిపివేశామని, మరల బ్రహ్మోత్సవాలు తరువాత లడ్డు విక్రయాలు యధావిధిగా కొనసాగుతాయని భక్తులు గమ నించాలని కోరారు.

ఏపీఎంగా ఆదినారాయణ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - ఆనందపురం: మండల వెలుగు ప్రాజెక్ట్ మేనేజర్‌గా ఎస్.ఆదినారాయణ బాధ్యతలు చేపట్టారు. ఆదినారాయణ డిఆర్డిఏ నుండి ఆనందపురం ఏపీఎంగా వచ్చారు. ఇక్కడ పనిచేసిన నాగభూషణ్ ఇటీవలే బదిలీలో భాగంగా భీమిలి వెళ్లారు. ఈ మేరకు ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆదినారాయణకు వెలుగు అధికారులు, డ్వాక్రా సిబ్బంది పలువురు అభినందనలు తెలిపారు.

జీవీఎంసీ క్రికెట్ జట్టు ఘన విజయం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరంలో గల జింక్ మైదానంలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో జీవీఎంసీ జట్టు ఘనవిజయం సాధించిందని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి సంపత్ కుమార్ తెలిపారు. జింక్ మైదానంలో శుక్రవారం జరిగిన వీడిసిఏ ఇన్స్టిట్యూషన్ ఫుల్ "సి" గ్రూప్ మ్యాచ్లో జీవీఎంసీ క్రికెట్ జట్టు 40 పరుగులు తేడాతో ఐసిఎ జట్టుపై ఘన విజయం సాధించిందని మొదటగా బ్యాటింగ్ చేసిన జీవీఎంసీ జట్టు 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసిందని జీవీఎంసీ తరఫున సునంద 52, ప్రశాంత్ 31, జి శ్రీను 39 పరుగులు చేశారని, అనంతరం బ్యాటింగుకు దిగిన ఐసిఎ జట్టు 15.3 ఓవర్లలో 112 పరుగులు చేసి ఆల్ అవుట్ అయిందని తెలిపారు ఐసిఎ జట్టు తరఫున ముకేశ్ 28, రెడ్డి 43 పరుగులు చేశారని జీవీఎంసీ తరఫున త్రినాథ్ 5, అనిల్ 3 వికెట్లు తీసి జీవీఎంసీ జట్టు విజయానికి కీలక పాత్ర పోషించారని కమిషనర్ తెలిపారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్ డివి రమణమూర్తి జివిఎంసి క్రికెట్ జట్టు టీమ్ సభ్యులను, టీమ్ మేనేజర్ సన్యాసిరావు లను అభినందిస్తూ అలాగే జీవీఎంసీ కి మరిన్ని విజయాలు అందించే విధంగా కృషి చేయాలని అన్నారు.

టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా చేసిన జగన్

- న్యాయస్థానాలపై టిడిపికి గౌరవం ఉంది
- కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: టీటీడీని జగన్మోహన్ రెడ్డి రాజకీయ పునరావాస కేంద్రంగా చేసుకున్నారని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత 81మందితో టీటీడీ బోర్డు నియామకం జరిగిందని, హైకోర్టుకు వెళ్లితే 52మందిని సస్పెండ్ చేసిందన్నారు. ఆయన భక్తులకు స్వామి వారిని దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ స్థానాలన్నా, న్యాయమూర్తులన్నా తెలుగు దేశం పార్టీకి గౌరవం ఉందన్నారు. వైసీపీ వారిలా న్యాయ మూర్తుల ఫోన్లు ట్యాప్ చేయడం, సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు చేయడం, దాడులు చేయడం వంటివి మేము చేయం అని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ఏమి వచ్చిందో కూడా తెలియకుండా అత్యంత సున్నితమైన అంశంపై కూడా జగన్మోహన్ రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తిరుమలలో జరిగిన కుట్రల్లో తప్పు చేసింది జగన్మోహన్ రెడ్డి అని, సిట్ దర్యాప్తులో దొరికిపోవడం ఖాయమన్నారు. చేసిన పాపాల్లో నుంచి బయటపడేందుకే కరుణాకర్ రెడ్డికి నాకు బంధుత్వం లేదని జగన్ రెడ్డి చెప్పున్నారన్నారు. అక్రమాస్తుల కేసులో సీబీఐ విచారణ సమయంలో కూడా గాలి జనార్ధన్ ఎవరో నాకు తెలియదని చేతులెత్తేశారని ఏద్దేవా చేశారు. టీటీడీలో అన్యమతస్తుల నియామకం, బస్సు టికెట్లపై అన్యమత ప్రచారం, తిరుమల కొండపై అన్యమత గుర్తు, టీటీడీ వెబ్ సైట్లో అన్యమత బోధనలు, భక్తుడికి అశ్లీల వెబ్ సైట్ లింక్ పంపడం, దర్శనం, వసతి, అద్దె, టోల్, ప్రసాదాల ధరలు పెంచడం వంటి అనేక ఘటనలు గత ప్రభుత్వంలో తిరుమల పవిత్రతను దెబ్బతీశాయన్నారు. సుప్రీం కోర్టు సిట్ రద్దు చేసిందని జగన్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో ఎటువంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో టిడిపి జోన్ 1 మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి పోతన్నరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోటోప్లెక్స్ డీలర్‌షిప్‌ను ప్రారంభించిన పియాజియో వెహికల్స్

విశాలాంధ్ర - విశాఖపట్నం: సుప్రసిద్ధ వెస్పా, స్పోర్టీ అప్రిలియా శ్రేణి స్కూటర్లు మోటార్‌సైకిళ్లకు ప్రసిద్ధి చెందిన ఇటాలియన్ ఆటో దిగ్గజం, పియాజియో గ్రూప్‌కు 100 శాతం అనుబంధ సంస్థ అయిన పియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ తమ మొదటి మోటోప్లెక్స్ డీలర్‌షిప్‌ను నగరంలోని ఏర్పాటు చేసింది. విశాఖపట్నం వద్ద ప్రారంభించినట్లుగా వెల్లడించింది. ఈ స్టోర్‌ను శాసనసభ్యులు గంట శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఇది మోటోప్లెక్స్ - యల్లోప్ మోటో పూర్తి శ్రేణి వెస్పా, ఏప్రిలియా, మోటో గుజ్జీతో పాటు ప్రత్యేకమైన అధికారిక మర్చండైజ్ మరియు సిబియుల క్రింద పూర్తి శ్రేణి ఉత్పత్తులను ప్రదర్శిస్తుందని, పియాజియో ఇండియా 2 వీలర్ డొమెస్టిక్ బిజినెస్ ఈవీపీ అజయ్ రఘువంశీ, యల్లాప్ మోటో మేనేజింగ్ డైరెక్టర్ యల్లపు నరేంద్ర వెల్లడించారు.

సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ ట్రస్ట్ జిల్లా సహాయ కార్యదర్శిగా దళాయి శివ

విశాలాంధ్ర - ఆనందపురం: కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో మేమున్నామంటూ సాయం అందించారు. తరచూ రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, కంటి శిబిరాలు, అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారికి తమకు తోచినంత సాయం అందిస్తూ పలు సంస్థలతో స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను గుర్తింపుగా ఓఎస్‌జి ఫౌండేషన్ అధినేత శివ దళాయిని అఖిలభారత అవయవదాతల సంఘం సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ గూడూరు సీతామహాలక్ష్మి జిల్లా సహాయ కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఈ అవకాశం కల్పించిన ట్రస్ట్‌కి శివ దళాయి ధన్యవాదాలు తెలిపారు.

ఆఫ్టర్ సేల్స్ సర్వీస్‌లో ఒప్పో ఇండియాకి నెంబర్ వన్ స్థానం

విశాలాంధ్ర - విశాఖపట్నం: అసమానమైన సేవా అనుభవాన్ని అందించాలనే తన నిబద్ధతకు అనుగుణంగా, ఒప్పో ఇండియా విక్రయాల అనంతరం సేవలు అందిస్తూ వినియోగదారుల సంతృప్తిలో నెంబర్ 1 స్థానాన్ని సంపాదించింది. తన వినియోగదారులలో 62 శాతం మంది తమ స్టోర్‌లో అమ్మకాల అనంతరం సేవ విషయంలో 'చాలా సంతృప్తికరంగా ఉన్నాము' అని రేటింగ్ ఇచ్చారు. ఆగస్టు 2024లో, కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ భారత దేశంలోని మొదటి ఐదు స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌లకు సంబంధించి 2,000 మంది కి పైగా వినియోగదారులతో వారి విక్రయానంతర సేవా అనుభవాలను కొలిచేందుకు ఒక సమీక్షను నిర్వహించింది. ఈ గుర్తింపు లో ఒప్పో ఇండియా తన ప్రతిభ చూపింది.

ఇండియా జ్యుయలరీ ఫెయిర్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ప్రముఖ ఈవెంట్ మేనేజుమెంట్ సంస్థ అదితి ఆధ్వర్యంలో "ఇండియా జ్యుయలరీ ఫెయిర్ - 2024" ప్రదర్శన ప్రారంభించారు. పీఎం పాలెం క్రికెట్ స్టేడియం దగ్గర వైజాగ్ కన్వెన్షన్స్ లో ఈ పేరు నిర్వహిస్తున్నారు. ఈ ఫెయిర్ అక్టోబర్ 4 వ తేదీ నుడి 6 వ తేదీ వరకు మూడు రోజులు పాటు నిర్వహిస్తున్నారు. జ్యుయలరీ ప్రదర్శన మరియు అమ్మకాలు సందర్శకులకు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ఫెయిర్ నాడు దేశం నలుమూలల నుండి తెచ్చిన విభిన్న డిజైన్స్ ఆభరణాలు అన్ని ఒకే చోట లభిస్తాయి. బంగారం, వజ్రాలు మరియు ప్లాటినం తో తయారైన ఆభరణాలు మరియు రత్నాలు పొదిగిన నగలు విస్తృత శ్రేణిలో దేశంలోని విభిన్న ప్రాంతాల సంప్రదాయతలు కలబోసినవి ఇక్కడ లభిస్తాయి.

దసరా సందర్భంగా కోలాటం పోటీలు

విశాలాంధ్ర - భీమిలి: గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గంటా నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో దసరా సందర్భంగా కోలాటం పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జరిగే మండల స్థాయి పోటీలకు ఎంపీడీఓ, ఎమ్మార్వోలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని అన్నారు. ఒక్కో మండలానికి ఒక సీనియర్, ఒక జూనియర్ బృందాన్ని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. 12వ తేదీన భీమిలిలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో నిర్వహించే ఫైనల్స్‌లో విజేతలను ఎంపిక చేస్తారన్నారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో మొదటి బహుమతిగా రూ.50,116, రెండవ బహుమతిగా రూ.25,116, మూడవ బహుమతిగా రూ.15,116 ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల కళాకారులు ఆయా ఎంపీడీఓ, ఎమ్మార్వో కార్యాలయాలను సంప్రదించాలన్నారు.

వేంకటాద్రివాసునికి పంచామృతాభిషేకం

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర తిరుపతి అయిన పెందుర్తి వెంకటాద్రి క్షేత్రంలో స్వామివారికి శుక్రవారం పంచామృత అభిషేకం నిర్వహించినట్లు ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామనుజాచార్యులు తెలిపారు. అభిషేకం అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించామని తెలిపారు. అలాగే దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వెంకటాద్రి క్షేత్రంలో గల శ్రీ లక్ష్మీ అమ్మవారిని 9 రోజులు వివిధ అలంకారాలలో భక్తులకు దర్శనం కల్పిస్తామని రామానుజాచార్యులు తెలియజేసారు.

రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి నుండి పార్లుపాలెంకు వెళ్లే ప్రధాన రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులతో పాడైన రోడ్డు పునర్నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు శుక్రవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల వలన పాడైన రోడ్డుకు ప్యాచ్ వర్క్ కాకుండా, పూర్తిగా రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. చీమలాపల్లి బస్సు స్టాప్ నుండి శ్రీ వేదమాత గాయత్రి మందిరం వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని, ఆ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్డుకు కాంక్రీట్ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే మిగిలిన యూజీడీ పనులు పూర్తిచేసి రోడ్డును బాగు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూజీడీ అధికారులు, మాజీ ఎంపీటీసీ అయిత ఎర్రయ్య, వైసిపి నాయకులు ఆకుల గుణాకర్, కంచిబోయిన వెంకట సంతోష్, దువ్వి అప్పారావు, సబ్బవరపు ప్రకాష్, మల్లువలస సూర్య నారాయణ, విరోతు విశ్వనాథం, బొట్ట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వివాదంలో సుప్రీం తీర్పు పట్ల హర్షం

విశాలాంధ్ర - ఆనందపురం: తిరుమల తిరుపతి లడ్డు వ్యవహారంపై వేసిన సిట్ దర్యాప్తు కల్తీ అని తేలడంతో ఉన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కూడా ధ్రువీకరించడం పట్ల టిడిపి యువ నాయకుడు, వేములవలస పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ సమర్థించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న సుప్రీంకోర్టు సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలపడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఎంతో భక్తి పారావస్యంగా శ్రీవారిని దర్శించుకుని అక్కడ గల లడ్డూలను భక్తులు వారి కుటుంబ సభ్యులకు, మిత్రులకు అందజేయడం చేస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. అయితే ఇందులో జంతువుల కొవ్వుకలిపి గత ప్రభుత్వ నిర్వాకం చేసిందని దీంతో ఎంతోమంది భక్తుల మనోభావాలు దెబ్బతీసిందని, ఇది చాలా దారుణమన్నారు. ప్రస్తుతం తిరుపతి లడ్డు అంటేనే భక్తులు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో మూలాలు తెలుసుకొని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించాలని, కల్తీ వ్యవహారాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని అప్పుడే శ్రీవారి లడ్డుపై నమ్మకం ఏర్పడుతుందని కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ అన్నారు.

జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా

ప్రభాకర్ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా ఏ.ప్రభాకర్‌రావు శుక్రవారం ఉదయం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గత నెల సెప్టెంబర్ 21న పట్టణ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సిఆర్డిఏలో పనిచేస్తున్న ప్రభాకర్‌ను జీవీఎంసీ సిసిపిగా నియమించారు. ఇక్కడ సిసిపిగా పని చేసిన బి.సురేష్ కుమార్‌ను సిఆర్‌డిఏలో నియమించారు. దాదాపు నెలరోజుల పాటు ఇన్‌చార్జ్ సీసీపీల పాలనలోనే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం సాగింది. సిటీ ప్లానర్‌గా బాధ్యతలు చేపట్టిన ధనుంజయ రెడ్డి ఇన్చార్జి చీఫ్ సిటీ ప్లానర్‌గా ఇన్ని రోజులు బాధ్యతలు చేపట్టారు. పూర్తిస్థాయి చీఫ్ సిటీ ప్లానర్‌గా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టడంతో టౌన్ ప్లానింగ్ విభాగం గాడిలో పడనుందని తెలుస్తుంది. ఈ సందర్భంగా ప్రభాకర్‌ను టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలతో అభినందనలు తెలియజేశారు. అంతకుముందు సిసిపిగా నియమితులైన ప్రభాకర్ జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్‌ను శుక్రవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో బదిలీలు నేపథ్యంలో కొత్త వారి జాయినింగ్, జోన్ల కేటాయింపుల తోపాటు వార్డుల్లో విధుల నిర్వహణ, సిబ్బందికి బాధ్యతలు అప్పగింతపై ఇరువురు చర్చించారు.

అభినందనల వెల్లువ:

జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏ.ప్రభాకర్ రావును టౌన్ ప్లానింగ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కే.వెంకటేశ్వరరావు సారధ్యంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు కిషోర్ కుమార్, అమ్మాజీలు శుక్రవారం జీవీఎంసీలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వీఎంఆర్డీఏలో, ఆర్‌డి ఆఫీస్‌లో పనిచేస్తున్న ప్లానింగ్ అధికారులంతా వచ్చి ప్రభాకర్‌కు అభినందనలు తెలియజేశారు.

నేడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు

- మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ముగింపు ఉత్సవాలను నిర్వహి స్తున్నట్లు ప్రముఖ రచయిత, మాజీ మంత్రి దాడి వీరభద్ర రావు అన్నారు. శుక్రవారం విజేఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నటుడు మురళీమోహన్‌కి అక్కినేని స్మారక పురస్కారం అందజేస్తున్నారన్నారు. తెలుగు సినీ రంగం మహా నటులు ఎన్టీఆర్, ఏఎన్ఆర్ రంగస్థలం నుండి వచ్చారన్నారు. ఆ మహానటులను ప్రస్తుత నటులందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్‌ను 47 ఏళ్ల క్రితం ప్రారంభించారని, సంస్థ అధినేత మద్దాళి రఘురాం అన్ని ప్రాంతాల్లో కళా రంగాలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండడం అభినందనీయం అన్నారు. కళాభారతిలో సాయంత్రం 5.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథిగా ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, గౌరవ అతిథులుగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఆత్మీయ అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి పాల్గొననున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ మద్దాళి రఘురాం, ప్రముఖ సాహితీవేత్త పార్వతీశం, న్యూ రోషన్ లాల్ ఆర్కెస్ట్రా గాయకుడు రాజేంద్ర ప్రసాద్, ఎస్.వి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు అదనపు ఉపాధ్యాయులను నియమించండి

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పద్మనాభం పంచాయితీ పరిధి ఇసకలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని ఎ. ఆదిబాబు అనే ఉపాధ్యాయుడుని చిన్నాపురం యం.పి.పి. స్కూల్ కు బదిలీ చేసారని, ఒక్క ఉపాధ్యాయునితో ఐదు తరగతులు ఉన్న స్కూల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం లేదని అదనపు ఉపాధ్యాయులను నియమిచాలని కోరుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ హంస జ్యోతి, మాజీ జెడ్పిటిసి దామోదర్, మూర్తి, హంస మహేష్, ప్రజా ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఉన్న ఒక ఉపాధ్యాయుడు సెలవు పెడితే స్కూల్ మూసివేసే పరిస్థితి ఏర్పడుతుందని, నిరుపేదలమైన మేము ప్రభుత్వ స్కూల్లలో మా పిల్లలను నాణ్యమైన విద్యకోసం చదివించుకుంటున్నామన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మా పిల్లలకు మెరుగైన విద్యను అందించుటకోసం మా స్కూల్ నుండి బదిలీ చేసిన ఉపాధ్యాయుడుని పునర్నియామకం చేసి మా స్కూల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాల భవనం కూడా పాడైపోయిందని నూతన భవనం నిర్మించాలని , ప్రహరీ కూడా నిర్మించాలని వినతిలో కోరారు.

విద్య ద్వారా ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర - ఆనందపురం: విద్య ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రామకృష్ణ పట్నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో యువశక్తి వారి సహకారంతో ఆనందపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ వృత్తివిద్యా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే .రామకృష్ణ పట్నాయక్ సహాయ సహకారాలతో బ్యూటీ అండ్ వెల్నెస్ ఉపాధ్యాయురాలు అమ్మాజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒకేషనల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు వృత్తి విద్య అనేది భవిష్యత్తులో చాలా అవసరమని ప్రతి ఒక్క విద్యార్థి ఈ విద్యలో నైపుణ్యత సాధించాలని పేర్కొన్నారు. విద్యార్థులు మాట్లాడుతూ స్కూలు యాజమాన్యం ప్రధానోపాధ్యాయులు వారు వృత్తి విద్యను నేర్చుకోవడానికి చాలా ప్రోత్సహించారని బ్యూటీ అండ్ వెల్నెస్ వృత్తివిద్య అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో వారికి మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని విద్యార్థుల తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, వృత్తి విద్య ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

ఆదర్శ్‌లో స్ట్రెస్ మేనేజ్మెంట్ సెమినార్

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజ్‌లో స్ట్రెస్ మేనేజ్మెంట్ సెమినార్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఎన్.ఈ ఫ్లోరా తెలియజేశారు. ఈ సందర్భంగా స్ట్రెస్ మేనేజ్మెంట్ గూర్చి విద్యార్థులకు కంట్రోల్, ఎక్సపెక్టేషన్స్, కంపేర్, బ్రీతింగ్, ఎక్స్ప్రెషన్స్, గ్రాటిట్యూడ్ గురించి సి.కె.బాబు వివరించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా ట్రబుల్ మేకింగ్ డిసిసన్స్ చేయడం, ఎమోషన్స్ పట్ల సరైన అవగాహన లేకపోవడం, అసూయ, ద్వేషాలు, సరియైన నిర్ణయాలు తీసుకోక పోవడం స్ట్రెస్‌కు ప్రధాన కారణంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఎదుటి వారితో పోల్చుకోవడం కాకుండా మన సామర్థ్యానికి తగ్గటుగా పనిచేయడం ద్వారా, స్ట్రెస్‌ని ఓవర్ టేక్ చేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాస్‌రావు, ఏ.ఓ. జి.రవి బాబు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ టి.థియోఫిలాస్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో విద్యార్థులు ఎన్నోరకాల ఆందోళనలు, ఒత్తిడిలకు లోనవుతూ స్ట్రెస్ మేనేజ్మెంట్ చేయడంలో విఫలం అవుతున్నారని, ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం వుంటుందని గుర్తించాలని ఉద్బోధించారు.

జివిఎంసి స్థాయి సంఘంలో

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలో జివిఎంసి పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని స్థాయి సంఘం చైర్ పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయి సంఘం సమావేశ మందిరంలో స్థాయి సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థాయి సంఘం చైర్ పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం సమావేశంలో 124 అంశాలతో పాటు 19 టేబుల్ అజెండా అంశాలతో కలిపి మొత్తం 143 అంశాలను పొందుపరిచారని, వాటిని స్థాయి సంఘం సభ్యులు చర్చించిన పిదప 12 అంశాలు వాయిదా వేయగా 93వ అంశం అనకాపల్లి మార్కెట్లకు సంబంధించి ఒక అంశాన్ని తిరస్కరించారని, 118 అంశం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తనిఖీల బృందం సభ్యుల యొక్క జీతాలను ఆమోదిస్తూ ఇకపై తనిఖీ బృందాల సర్వీసులను నిలుపుదల చేస్తున్నట్లు సభ్యులు తీర్మానించారని ఆమె తెలిపారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన సుమారు రూ.31.56 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి సుమారు రూ.55.22 లక్షల అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారని చైర్ పర్సన్ తెలిపారు. ఈ సమావేశంలో జివిఎంసి కార్యదర్శి ఎం.వి.డి. ఫణి రామ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసుదేవ రెడ్డి, జోనల్ కమిషనర్లు కే.శివప్రసాద్, మల్లయ్య నాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్లు దిలీప్, రత్నాకర్ రెడ్డి, రమణమూర్తి, సుధాకర్, అప్పారావు, సహాయక వైద్యాధికారులు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.